
ప్రజాశక్తి
ఆదివారం 26 జనవరి 2025
5
విజయనగరం



గణతంత్ర దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

పరిశీలించిన జెసి మాధవన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలకు చేస్తున్న ఏర్పాట్లను జెసి సేతు మాధవన్ శనివారం సాయంత్రం పరిశీలించారు. పతాక ఆవిష్కరణ వేదిక, గ్రౌండ్, స్టాల్స్, శకటాల మార్గం, వీఐపీ గ్యాలరీ, ఇతర ఏర్పాట్లను తనిఖీ చేశారు. మార్పులు చేర్పులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా, లోటుపాట్లకు తావివ్వకుండా, పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఆర్డీవో డి.కీర్తి, తాహశీల్దార్ కూర్మనాధరావు, ఇతర అధికారులు జెసి వెంట ఉన్నారు.

వేతన.. వేదన

- నెలల తరబడి అందని జీతాలు
- విద్యార్థులకు అన్నం పెట్టి పస్తులుంటున్న భోజన కార్మికులు
- హైస్కూల్లో వంటమ్మలకు అందని వేతనాలు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జగనన్న గోరు ముద్ద, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ఇలా పాలకులు మారినప్పుడల్లా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం పేర్లు మారుతున్నా వంటమ్మల పరిస్థితి మాత్రం మారడం లేదు. నెలల తరబడి జీతాలు అందక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. తమ కష్టానికి తగ్గ జీతం చెల్లించాలని పోరాడుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు (వంటమ్మ)లను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. జిల్లాలోని 1799 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 1లక్షా 50వేల పైగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతన్న విద్యార్థులకు 7వేల మంది స్వయం సహాయక సంఘాల్లో మహిళలు మధ్యాహ్న భోజనం ప్రభుత్వ మెనూ ప్రకారం వండి వడ్డిస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న వంటమ్మలకు మూడు నెలలుగా జీతాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం పెండింగ్ వేతనాలు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికల సంఘం నాయకులు, వంటమ్మలు కోరుతున్నారు. నెలంతా కష్టపడి పనిచేస్తున్న వీరికి ప్రభుత్వం నెలకు గౌరవేతనం రూ.4500 ఇచ్చే తక్కువ జీతం కూడా చెల్లించకపోవడం దారుణం. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.5.95, ఉన్నత పాఠశాలలో రూ.8.25 విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం ఖర్చు చేస్తున్న వంటమ్మ బిల్లులు కూడా చెల్లించకపోవడంతో వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.

ప్రభుత్వ జీవో 108 ప్రకారం వంటమ్మలకు నెలకు రూ.11,500 చెల్లించాలి. అయితే నెలకు రూ.4,500లు మాత్రమే ఇస్తున్నారు. దీనిలో కేంద్రం వాటా ఇస్తున్నారు తప్ప రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద ఇవ్వాల్సిన వేతనం ఇవ్వడం లేదు. సంక్రాంతికి వంటమ్మలకు, ఆయమ్మలకు పెండింగ్ జీతాలు చెల్లించకపోవడంతో పస్తులతో పండగ గడపాల్సిన పరిస్తితి నెలకొంది. ఇకనైనా ప్రభుత్వం పెండింగ్ జీతాలు, బిల్లులు చెల్లించాలని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న నిర్వాహకులు కోరుతున్నారు. మరోవైపు అంగన్వాడీలు, సంఘమిత్రలతో పాటు వంటమ్మలకు కూడా రాజకీయ వేధింపులు తప్పడం లేదు. రాజకీయ కక్షలతో జిల్లాలో కొందరిని తొలగిస్తున్నారు. గజపతినగరం, వేపాడ, డెంకాడ, ఇలా జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో కొందరు నిర్వాహకులను రాజకీయ ఒత్తిళ్లతో తొలగించారు.

హైస్కూళ్లలో వంటమ్మలకు..

జిల్లాలో సుమారు 300కు పైగా ప్రభుత్వ హైస్కూళ్లు ఉన్నాయి. 8,9,10 తరగతి విద్యార్థులకు వంటలు చేస్తున్న ఆయాలకు నేటి వరకు పూర్తిగా వేతనాలు ఇవ్వడం లేదు. మరోవైపు వారిని తొలగిస్తామంటూ అధికార పార్టీ నాయకులు బెదిరిస్తున్నారు. కొత్తవలస ప్రాంతంలో రాజకీయా వేధింపులకు వ్యతిరేకంగా ఆయాలు పోరాడుతూనే ఉన్నారు. మరో వైపు జూనియర్ కళాశాలలకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యత ప్రైవేటు సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. తమకు ఆ బాధ్యతలు అప్పగించాలని హై స్కూల్లో పని చేస్తున్న కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్‌కు, విద్యా శాఖ అధికారులకు ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు.

అప్పుల ఊబి నుంచి కాపాడండి



ప్రభుత్వం ఇస్తున్న మెనూ ఛార్జీలు చాలక పోవడం, ఇస్తున్న బడ్జెట్ సకాలంలో విడుదల చేయక పోవడం వలన అప్పులు చేసి వంటలు చేయాల్సిన పరిస్తితి ఉంది. మాకు వస్తున్న గౌరవ వేతనాలు వడ్డీలకు ఇవ్వాల్సిన పరిస్తితి ఉంది. సకాలంలో బిల్లులు చెల్లించి, మాకు ఇస్తున్న అరకొర వేతనాలు పెంచి ఆర్థిక ఇబ్బందులు నుంచి కాపాడాలి. వేతనాలు పెంచాలి.

-దాలి రామలక్ష్మి, బోజన పథకం నిర్వాహకురాలు

బడ్జెట్ కేటాయింపులు పెంచాలి



మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలు పరి ష్కరించాలి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజకీయ వేధింపులు జరుగుతున్నాయి. ప్రభుత్వాన్ని అనేకసార్లు కలిసి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ సమస్యలు పరిష్కరించడం లేదు. అతి తక్కువ వేతనాలు రూ.3 వేలతో పని చేయమని చెప్తున్నారు ధరలు కనుగుణంగా జీతాలు పెంచాలి. మౌలిక వసతులు కల్పించాలి. విద్యార్థికి ఇచ్చిన మెనూ రూ.20 పెంచాలని, 9 10 తరగతులకు వంట చేసిన వారికి జీతాలు ఇవ్వాలి. బడ్జెట్ కేటాయింపులు, జీతాలు, మెనూ ఛార్జీలు పెంచాలి. లేని పక్షంలో మధ్యాహ్న భోజన పథక కార్మికులను ఐక్యం చేసి పోరాడుతాం.

- బి.సుధారాణి, ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి



ప్రభుత్వ ప్రధానకార్యదర్శి విజయానంద్ నుంచి అవార్డులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, కమాండెంట్ మల్లికా

కలెక్టర్, ఎస్‌పి, కమాండెంట్‌కు అవార్డులు ప్రదానం

ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విజయవాడలో శనివారం అవార్డు స్వీకరించారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, 5వ బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ కూడా పభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి అవార్డులు స్వీకరించారు.

- ప్రజాశక్తి, విజయనగరంకోట

దేశ నిర్మాణంలో ఓటు ముఖ్యమైనది

- నిష్పక్షపాతంగా ఓటు వేయాలి
- పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి
- ఓటర్ల దినోత్సవ వేడుకల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి



ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా ప్రధానన్యాయమూర్తి కళ్యాణచక్రవర్తి, జెసి సేతుమాధవన్, తదితరులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

దేశ నిర్మాణం లో ఓటు హక్కు అత్యంత ముఖ్యమైనదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ చక్రవర్తి తెలిపారు. పాఠశాల స్థాయి నుండే దేశం గొప్పదనం గురించి, ప్రజాస్వామ్యం గురించి పిల్లలకు బోధిస్తే వారికి ఓటు విలువ తెలుస్తుందని పేర్కొన్నారు. ఓటర్లు నిష్పక్షపాతంగా ఓటు వేయడం అలవర్చుకోవాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియం లో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మనిషి జీవనానికి స్వేచ్ఛ అవసరమని, ప్రజాస్వామ్యం నుండే ఆ స్వేచ్ఛ లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ముఖ్యమని, గతంలో ఎంతో మంది పోరాటం చేయడం వల్లనే స్వాతంత్ర్యం వచ్చిందని, అప్పటి దేశ భక్తి ప్రస్తుత తరం లో కనపడడం లేదని , తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలలో లెక్కలు, సైన్సు తో పాటు దేశ భక్తి గురించి కూడా బోధించాలని తెలిపారు. చదువు, ఉద్యోగం , సంపాదన తప్ప దేశ భక్తి గురించి పిల్లలకు తెలియడం లేదని, దేశాన్ని ధన తంత్రంగా కాకుండా గణతంత్రంగా ఉంచాలని హితవు పలికారు. జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఓటు వేయడానికి ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని , 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా చేరాలని తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ ఓటరు నమోదు కోసం గతం లో జనవరిలో మాత్రమే అవకాశం ఉండేదని, ప్రస్తుతం సంవత్సరంలో 4 సార్లు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించారని తెలిపారు. స్వీప్ కార్యక్రమం ద్వారా 18 ఏళ్ళు నిండిన వారిని ఓటర్లుగా చేర్చడం జరుగుతోందని, ఎన్‌ఆర్‌ఐలకు కూడా ఓటు హక్కు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఓటు ఫర్ ష్యూర్ అనే నినాదం తో జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. తొలుత సభలో అందరితో ఓటర్ల దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. సభ అనంతరం ఎక్కువ సార్లు ఓటింగ్ లో పాల్గొన్న సీనియర్ సిటిజెన్ విద్యా సాగర్ జైన్ , వికలాంగ ఓటరు కొండబాబు, ట్రాన్స్‌జెండర్ ప్రణీతను ఈ సందర్భంగా సన్మానించారు. నూతన ఓటర్లకు ఎపిక్ కార్డు లను అందజేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఉత్తమ బిఎల్‌ఒలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కీర్తి, జిల్లా అధికారులు, యువ ఓటర్లు , విద్యార్థులు, పాల్గొన్నారు.

నిలిచిన ధాన్యం కొనుగోలు

- మిల్లర్ల వద్ద బ్యాంకు గ్యారెంటీలు లేకపోవడమే కారణం
- ఆందోళన చెందుతున్న రైతులు



ధాన్యంతో రోడ్డు పక్కన నిలిపేసిన వాహనాలు

ప్రజాశక్తి - భోగాపురం

మిల్లర్ల బ్యాంకు గ్యారంటీలు ముగియడంతో మండలంలోని రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు గత రెండు రోజులు నుంచి నిలిచిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోలేదని మండిపడుతున్నారు. శనివారం సాయంత్రం కొంత మంది రైతులు భోగాపురం సొసైటీలోని ధాన్యం కొనుగోలు చేయాలంటూ సంబంధిత అధికారి రామిశెట్టి జనార్ధన్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు. బ్యాంకు గ్యారంటీలు లేవని ఆయన తేల్చి చెప్పారు. మండలంలోని పోలిపల్లి, భోగాపురం సొసైటీల్లో ఇటీవలి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో సుమారు 2,700 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు సుమారు 1100 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. మండలంలోని ఐదు మిల్లర్లుకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం నుంచి పంపించాల్సి ఉంది. డెంకాడ శ్రీసాయి విజయగణపతి, పూసపాటిరేగకు చెందిన ఆకి శ్రీనివాస, శ్రీలక్ష్మి శ్రీనివాస, సవరవల్లిలోని శుభకరి, అక్కివరంలోని శ్రీవెంకటపద్మా మిల్లుల్లో బ్యాంకు గ్యారంటీలు ముగిసినట్లుగా అధికారులు చెబుతున్నారు. దీనిపై వ్యవసాయ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ బ్యాంకు గ్యారంటీలు ప్రస్తుతానికి పూర్తయ్యాయన్నారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నామని తెలిపారు. సోమవారం నాటికి వచ్చే అవకాశం ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని తెలిపారు.

పింఛనుదారులూ.. ఆందోళన చెందొద్దు

- ఇబ్బందులు లేకుండా పరిశీలన
- కేంద్రాల్లో ఏర్పాట్లు
- డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి



పింఛన్ల పునపరిశీలన కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం కోట

వికలాంగ పింఛనుదార్లు తమ సదరం సర్టిఫికెట్ల పున: పరిశీలన కోసం ఎటువంటి ఆందోళనా చెందవద్దని, కేంద్రాల్లో వారికి ఇబ్బందులులేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని డిఆర్‌డిఎ పీడీ కల్యాణచక్రవర్తి తెలిపారు. తమ పింఛన్లు పోతాయన్న అపోహలను నమ్మవద్దని, కేవలం పరిశీలన కోసమే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న దీర్ఘకాలిక రోగులు పూర్తిగా మంచానికే పరిమితమైన 342 మందికి ఇప్పటికే ఆయా ఇళ్లకు అధికారులను పంపి పరిశీలన చేయించామని తెలిపారు. వీరందరికీ ఇప్పటికే ప్రభుత్వం పింఛను 15 వేల రూపాయలు అందిస్తున్నదని అన్నారు. మిగతావారు ఎవరైతే ఉన్నారో 36,974 మందికి విడతల వారీగా నోటీసులు పంపించి, తొలివిడతగా ఈనెల 23 నుంచి 25 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని తెలిపారు. ఇఎన్‌టి, ఆర్థో, విజువల్, ఎమ్మార్, ఎమ్‌ఐ విభాగాల్లో పరిశీలన ఉ ఉంటుందన్నారు. హియరింగ్ విభాగంలో 521 మందికి, ఆర్థో 19,288 మందికి, విజువల్ 7038 మందికి, ఎమ్మార్ ఎమ్‌ఐ 529 మందికి పరిశీలన చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 13 టీములు పరిశీలన నిర్వహిస్తున్నాయన్నారు. ఒక్కో విభాగంలో రోజుకు 50 మందికి మాత్రమే నోటీసులు ఇచ్చి పిలుస్తున్నామన్నారు. వారంలో మూడు రోజులు మాత్రమే పరిశీలన జరగుతుందని, ఇలా సుమారు 22 వారాలు పట్టవచ్చు అన్నారు. రోగులకు ఆస్పత్రుల వద్ద ఎపిఒలు సహాయ సహకారాలు, సలహాలు అందిస్తారని తెలిపారు. వికలాంగులకు కుర్చీలు, తాగునీరు, వీల్‌చైర్లు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రోగులతో వచ్చే సహాయకులకు కూడా ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

అపోహలు నమ్మొద్దు

విజయనగరం టౌన్ : స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద నిర్వహిస్తున్న వికలాంగ పింఛన్ల పునః పరిశీలన కేంద్రాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం పరిశీలించారు. నగర పరిధిలో 3,068 మంది వికలాంగ పింఛన్లు పొందుతున్నారు. వీరిలో 2,922 మందికి పునః పరిశీలన నిమిత్తం సమాచారం అందించారు. ఈనేపథ్యంలో పరిశీలన కేంద్రాన్ని పరిశీలించారు. పింఛన్లు పొందుతున్న వారు తమకు కేటాయించిన తేదీలలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఘోషాసుపత్రికి వెళ్లి పరిశీలన పూర్తి చేసుకోవాలన్నారు. మానసిక వికలాంగుల కోసం విజయనగరం సర్వజన ఆసుపత్రిలో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పింఛన్లు రద్దు చేస్తారని అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం కేంద్రాసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న శౌచాలయాన్ని ఆయన పరిశీలించారు.

సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి ● ప్లేట్లు కొడుతూ కాంగ్రెస్ వినూత్న నిరసన

ప్రజాశక్తి- విజయనగరం కోట

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ టిడిపి కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. శనివారం థాలీ బచావో కార్యక్రమం పేరిట కలెక్టరేట్ వద్ద భోజన ప్లేట్లు, స్పూన్లతో శబ్దం చేస్తూ వినూత్న నిరసన తెలిపారు. మొద్దు నిద్రలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని నిద్రలేపే ప్రయత్నమే ఈ కార్యక్రమమని అన్నారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి 227 రోజులైనా ఇప్పటివరకు సంక్షేమ పెన్షన్లు, ఉచిత గ్యాస్ తప్ప ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, పథకాలను అమలు చేయలేదన్నారు. కమిటీలతో, ప్రణాళికలతో కాలయాపన చేస్తున్నారన్నారు. బాబు షఽరిటీ భవిష్యత్తు గ్యారంటీ అని బాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా మూలన పెట్టారన్నారు. యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ.3000 నిరుద్యోగ భతి, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15000, ఇంట్లో ఎంతమంది పిల్లలు చదివితే అంతమందికి రూ.15వేలు ఇస్తా మని చెప్పి ప్రజలను మోసం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులు అర్థాంతరంగా చదువుకు దూరం అవుతున్నారని, సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను వేధిస్తున్నాయని మండిపడ్డారు. 12వ పిఆర్‌సి వేయకపోవడం న్యాయమా? అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని లేనియెడల ప్రజా ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు గేదెల తిరుపతిరవు , సతీష్, ఒబిసి ఛైర్మన్ సురేష్, శ్రీనివాసరావు, షరీఫ్, బంగారు నాయుడు, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.



ప్లేట్లు కొడుతూ నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

బాగా చదవండి.. పరీక్షలకు సిద్ధం కండి

9న జరిగే ప్రజ్ఞా వికాసం పరీక్షలో పాల్గొనండి ● ఎస్ఎఫ్ఐ పిలుపు



ప్రజ్ఞా వికాసం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశకి-విజయనగరం టౌన్

10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఫిబ్రవరి 9న నిర్వహించే ప్రజ్ఞా వికాస పరీక్షలో విద్యార్థులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో పాల్గొని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రైజ్ మనీ జిల్లా మొదటి స్థానం రూ.5,000, రెండో స్థానానికి రూ.3,000, మూడవ స్థానానికి రూ.2,000 నగదు బహుమతిగా ఇస్తామని తెలిపారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్దమయే విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ప్రజ్ఞా పరీక్ష నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో 300మంది రాస్తే మొదటి మూడు స్థానాలకు మెమొంటోలు ఇస్తామన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఫిబ్రవరి 1వ తేదీ లోపు రూ.30 ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సామాజిక బాధ్యత కలిగిన విద్యార్థి సంఘంగా నిరంతరం విద్యార్థులతో ఉంటూ వారి సమస్యలపై పోరాడుతున్నామన్నారు. పబ్లిక్ పరీక్షలకు ముందు ఇటువంటి పరీక్షలు నిర్వహించి విద్యార్థులలో ఉన్న భయాందోళనలను పోగొట్టి విద్యార్థులలో ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

పరీక్ష రాసే విద్యార్థులు ఈ కింది ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. చీపురుపల్లి 99858 25957, విజయనగరం 75692 90549, 79975 32521, 85228 57986, ఎస్ కోట 62810 56384, 98488 43204, నెల్లిమర్ల 79935 17081, గజపతినగరం 81878 56162, రాజాం 72888 49236, 96762 20612, 93817 68275, జిల్లా కేంద్రం 98663 02963, బొబ్బిలి 95025 07945, 73863 29165, 97055 45164, 94924 14763 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రతీ డిపోకు 5 కొత్త బస్సులు

ఆర్‌టిసి జోనల్ చైర్మన్ దొన్నుదొర


ప్రజాశక్తి-రామభద్రపురం

ఆర్‌టిసిని బలోపేతం చేయడానికి పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నామని ఆర్‌టిసి జోనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర తెలిపారు. అందులో భాగంగా ప్రతీ డిపోకు ఐదు కొత్త బస్సులు సమకూర్చుతామన్నారు. రామభద్రపురంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆర్‌టిసిని లాభాల బాటలో పయనించే దిశగా ఉన్నతాధికారులు, ఉద్యోగులతో చర్చలు జరపనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జోనల్ పరిధిలో ఉన్న అన్ని డిపోల్లో సమీక్షలు చేసి, సమస్యలను గుర్తిస్తామన్నారు. సంక్రాంతి పండగ సమయంలో జోనల్ పరిధిలో సుమారు 50 లక్షల మంది ప్రయాణికుల ద్వారా రూ.4 కోట్ల ఆదాయం వచ్చిందని, గతంలో కంటే ఇది రెట్టింపు సంఖ్యలో ఉందని తెలిపారు. జోనల్ పరిధిలో 165 స్క్రాప్ బస్సులు ఉన్నట్టు గుర్తించామన్నారు. గిరిజన ప్రాంతం, గతంలో నడిచి ప్రస్తుతం నిలుపుదల చేసిన బస్సుల రూట్లలో పల్లె వెలుగు బస్సులు నడపనున్నామని తెలిపారు. అద్దె బస్సుల డ్రైవర్లకు మరింత శిక్షణనిచ్చి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నిరోధించడానికి చర్యలు చేపడతామన్నారు. ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద జాతరైన శంబరకు ఎక్కువ బస్సులు నడపనున్నామని, దీనిపై ఇప్పటికే ఆర్‌టిసి ఉన్నతాధికారులు దృష్టిసారించారని వెల్లడించారు. రామభద్రపురం మండలం ఎనుబరువు గిరిజన గ్రామానికి సాలూరు డిపో నుంచి పాచిపెంట మీదుగా మళ్లీ బస్సు సౌకర్యం పునరుద్ధరించనున్నామని తెలిపారు.

ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడమే స్వచ్ఛాంధ్రా..?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసి, ఆ పని అధికారులు, ప్రజలపైకి నెట్టేయడానికేనా? ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని తెరపైకి తెస్తోంది? అంటే ముమ్మాటికీ ఇదే కారణమనే సమాధానం వినిపిస్తోంది. స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివాన్ పేరిట ఈనెల 18న గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కార్యక్రమం చేపట్టిన సంగతి తెసిందే. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని కొందరు, ఇక నుంచి ప్రభుత్వం ఆధ్వర్యాన ప్రతి మూడో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మరికొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పిన సంగతి తెలిసిందే. కలెక్టరేట్‌లో సైతం ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ మాటలు, చేతల్లో తప్పేమీ లేదు. కానీ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విషయంలో ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ ఎంత? చిత్తశుద్ధి ఎంత? అన్నదే ఇక్కడి ప్రశ్న. ప్రభుత్వం చెప్పున్నట్టుగా ఎవరికి వారే స్వచ్ఛత పాటించే పరిస్థితి ఉందా? ఉంటే పరిశుభ్రత పేరిట జిల్లాలో కోట్ల రూపాయల పేరిట ఎందుకు కేటాయింపులు చేయాలి? ప్రజలే క్లీన్ అండ్ గ్రీన్ చేస్తే పారిశుధ్య కార్మికులను పెట్టుకోవాల్సిన అవసరం ఎందుకు వస్తుంది? ప్రజారోగ్యానికి ఉన్న ప్రాధాన్యతే ఇందుకు కారణం. కానీ, ఆ రకమైన బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకుంటోంది. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక ప్రజారోగ్యానికి అంటే గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, కాలువల్లో పూడిక తీత, బ్లీచింగ్ వంటివాటికి ఇవ్వాల్సిన నిధుల్లో కోత విధించింది. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వమూ బడ్జెట్‌లో ప్రజారోగ్యానికి ఏటా కోత విధించింది. దీన్ని ఆసరాగా చేసుకున్న అధికార యంత్రంగా



కూడా వచ్చిన అరకొర నిధుల్లో చిలకొట్టుడు వ్యవహారాలకు దిగుతోంది. ఫలితంగా గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదు. మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ చల్లడం లేదు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడం లేదు. తాగునీటి క్లోరినేషన్ కూడా సరిగా జరగని పరిస్థితి దాపురిస్తోంది. ఫలితంగా గ్రామాల్లో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫలితంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎప్పటికప్పుడు ఇటీవల కాలంలో డయేరియా, మలేరియా, డెంగ్యూ వంటి కేసులు పెరుగుతున్నాయి. ఇటువంటి కారణాలతోనే ఇటీవల కాలంలో బొండపల్లి మండలం బిల్లలవలసలోనూ, కురుపాం మండల కేంద్రంలోనూ డయేరియా ప్రబలింది. సుమారు 16మంది డయేరియాతో ఆసుపత్రులపాలయ్యారు. మూడు నెలల క్రితం గుర్ల మండల కేంద్రంలో సుమారు 10మంది డయేరియాతోనే చనిపోయారు. అనంతరం జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, టిడిపికి చెందిన జిల్లా మంత్రి, వైసిపికి చెందిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఆ గ్రామాన్ని సందర్శించి ప్రజారోగ్యం క్షీణించడం, మరణాలపట్ల మొసలి కన్నీరు కార్చడం తప్ప, అందుకు గల మూలాలను తెలుసుకుని, సురక్షితమైన నీటిని అందించేందుకు, పారిశుధ్య నిర్వహణ మెరుగు పర్చేందుకు మాత్రం ప్రయత్నించ లేదు. తాజాగా స్వచ్ఛాంధ్ర పేరిట ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నట్లు అధికార పక్షం ప్రచారం చేస్తుంటే, వైసిపి ఒకే తానులో ముక్కలా వ్యవహరిస్తోంది. ఈనేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యంగా స్థానిక పాలకులు ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారని, ఈ బాధ్యతలను ప్రజలు, అధికారులు, ఉద్యోగులపైకి నెట్టేశారని జనం చర్చించు కుంటున్నారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టులో సత్య కళాశాల విద్యార్థులకు చోటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టులో సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు జి.జనార్ధన్, ఎం. శ్రీవల్లి, బి.రమ్య, ఎం. సేతు మాధవి, బి.వరలక్ష్మికి చోటు దక్కింది. విశాఖపట్నం జిల్లా అంకుపాలెంలో జరగబోయే రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ టోర్నమెంట్‌కు విజయనగరం జిల్లా తరపున వెళ్తున్న జట్టులో వీరు ఎంపికయ్యారు. వీరిని కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు అభినందిస్తూ నగదు బహుమతిని అందజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం.ఉదయ్ కిరణ్, ఫిజికల్ డైరెక్టర్ ఎస్‌హెచ్ హెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

32 చోట్ల ఆధార్ అప్‌డేషన్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో 32 చోట్ల ఆధార్ అప్‌డేషన్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఆయా కేంద్రాల పనితీరును ఆయన సమీక్షించారు. వివిధ ప్రైవేటు కళాశాలల్లో ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అవసరమైన ప్రతి ఒక్కరు ఆధార్ నమోదు మరియు అప్ డేషన్ కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ఆధార్ కేంద్రాల సమాచారం, ఇతర వివరాలను సమీపంలో ఉన్న సచివాలయ సిబ్బంది తెలియజేస్తారని చెప్పారు.

వాలంటీర్ల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం కోట

వాలంటీర్ల పట్ల కక్ష సాధింపు చర్యలు తగదని, తమను విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యాన నగరంలోని సచివాలయ వాలంటీర్లు శనివారం ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద మానవహారం చేపట్టారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ వాలంటీర్లను కొనసాగిస్తామన్న ముఖ్యమంత్రి హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 6 నెలలుగా ప్రభుత్వం గౌరవ వేతనం చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, నాయకుడు వెలగడ రాజేష్ పాల్గొన్నారు.

జెఎన్‌టియులో క్లీన్ అండ్ గ్రీన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో శనివారం జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రత, మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, 'పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించడం సమాజం, సంక్షేమానికి ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమానికి సరుకులు అందజేత

కొత్తవలస : స్థానిక ఆంజనేయపేటలో ఉన్న చైతన్య వికలాంగుల ఆశ్రమానికి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు చెందిన పి.వి.రమేష్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు బోజంకి సన్యాసిరావు, ప్రిన్సిపల్ బి.ఎ. నాయుడు పాల్గొన్నారు

రామకృష్ణకు పురస్కారం

శృంగవరపుకోట : విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్, టి.వి.టూరిజం ఆరో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) సంస్థ వ్యవస్థాపకులు బి.రామకృష్ణకు భారత్ సేవా ద్రష్ట పురస్కారాన్ని ప్రదానం చేసింది. రామకృష్ణకు అవార్డు రావడం పట్ల పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాల సందర్శన

వేపాడ : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఎంఇఒ ఎన్.నాగభూషణరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారోనని ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిఆర్‌పి రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఆతవ రోడ్డు కోసం పోరాటం

వేపాడ : ఆతవ రోడ్డు నిర్మించాలని దశల వారీగా పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సిపిఎం జిల్లా నాయకులు చల్లా జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఆతవ రోడ్డు పూర్తి చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు.

నేటి నుంచి మరిడిమాంబ జాతర

వేపాడ : మండలంలోని బల్లంకి గ్రామంలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు మరిడిమాంబ జాతర నిర్వహిస్తున్నారు. జాతర సందర్భంగా పలు రకాల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- డెంకాడ

ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలని మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. శనివారం మండలంలోని గొలగాంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో 73 పశువులకు సాధారణ చికిత్సలు, 23 పశువులకు గర్భకోస చికిత్సలు, 420 గొర్రెలకు, మేకలకు, 133 ఆవులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాడి రైతులు పాల్గొన్నారు.

69 మద్యం సీసాలు స్వాధీనం

గజపతినగరం : అక్రమంగా తరలిస్తున్న 69 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేవుపల్లికి చెందిన వై.వెంకటరమణ సైకిల్‌పై మద్యం సీసాలు తరలిస్తుండగా చంపావతి నదిపై పట్టుకున్నట్లు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. ఆయన్ను అరెస్టు చేసి, కేసుదర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పోటీలో పాల్గొన్న ఎడ్లబండి

హోరాహోరీగా ఎడ్లబళ్ల పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

జంట గ్రామాలైన వేపాడ- వల్లంపూడిలో సాంబమూర్తి తీర్థం సందర్భంగా శనివారం నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేతగా నిలిచిన ఎడ్ల బండి యజమానికి రూ.15 వేలు, రన్నర్‌కు రూ.10 వేలు, మూడో బండి యజమానికి రూ.8 వేలతోపాటు ఏడో స్థానం వరకు నిలిచిన ఎడ్లబండ్ల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వాల ఏర్పాటుకు ఓటర్లే కీలకం

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వాల ఏర్పాటుకు ఓటర్లే కీలకమని పలువురు అధికారులు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం జిల్లాలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఓటు ప్రాధాన్యతను అధికారులు వివరించారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం సీనియర్ ఓటర్లను బొబ్బిలి ఆర్‌డిఒ రామ్మోహనరావు సన్మానించారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి శ్రీషిరిడి సాయి డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎన్నికల డిటి బి.గౌరీశంకర్, వాసు విద్యా సంస్థల అధినేత రౌతు వాసుదేవరావు, రెవెన్యూ ఉద్యోగులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ : వేపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు.

శృంగవరపుకోట : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని తహశీల్దార్ అరుణకుమారి ఆధ్వర్యాన పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల విద్యార్థులతో పట్టణంలోని ర్యాలీ నిర్వహించారు. వేపాడ మండలం బక్కునాయుడుపేట గురుకుల విద్యార్థినులు చేసిన నృత్యాలు అందర్నీ అలరించాయి. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో ఓటరు అక్షరాస్యత వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు పాల్గొన్నారు.

రామభద్రపురం : తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సులోచనారాణి ఆధ్వర్యాన ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం నూతన ఓటర్లుగా నమోదైన వారిని, సీనియర్ ఓటర్లను సన్మానించారు.

తెర్లాం : తెర్లాం హైస్కూల్లో తహశీల్దార్ జి.హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒ త్రినాథరావు, వెంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామారావు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : తహశీల్దార్ డిఎంజిఎన్ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు అందజేశారు. సీనియర్ ఓటర్లను, ప్రతిభ కనబరిచిన బిఎల్‌ఒలను సత్కరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది సర్వే డిపి అప్పారావు, ఆర్‌వి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



లక్కవరపుకోటలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు



వేపాడ మండలం బక్కునాయుడుపేట గురుకుల విద్యార్థులకు జ్ఞాపికను అందజేస్తున్న తహశీల్దార్

డెంకాడ : జాతీయ ఓటర్ల దినోత్సవం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారం చేశారు. అనంతరం బిఎల్‌ఒలను, సీనియర్ ఓటర్లను సన్మానించి జ్ఞాపకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.పద్మావతి, కళాశాల ప్రిన్సిపాల్ ఎం ఆదినారాయణ, ఆర్ఐ కిరణ్ విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడ మెట్ట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాజాం - పాలకొండ ప్రధాన రహదారిలో శనివారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల నుంచి ఉంగరాడ మెట్ట వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చిన్నారావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఆర్ఐ రేవతి, విఆర్‌ఒలు పాల్గొన్నారు.



బొబ్బిలి.. సీనియర్ ఓటర్‌ను సన్మానిస్తున్న ఆర్‌డిఒ మోహనరావు

భోగాపురం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కొమ్మూరు అప్పడుదొర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు తహశీల్దార్ సురేష్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎక్కువసార్లు ఓటు వేసిన ఇద్దరు సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఆర్ఐ ఇమ్రాన్, కళాశాల అధ్యాపకులు , తదితరులు పాల్గొన్నారు.

వంగర: స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి ధర్మరాజు, ఆర్ఐ బోనెల రామారావు, ఆర్‌ఎస్‌డిటి భవాని, డివిఎంసి సభ్యులు మజ్జి గణపతి, రెవెన్యూ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి స్థానిక జెడ్‌పి బాలికొన్నత పాఠశాలలో సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుదర్శనరావు, ఎలక్షన్స్ డిటి వివి ఆర్ జగన్నాధరావు, డిప్యూటీ డిఇఒ రమణ, ఎంపిడిఒ రామకృష్ణరాజు, తదితరులు పాల్గొన్నారు.

టెలీహబ్‌ను పరిశీలించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఘోషాసుపత్రిలో ఏర్పాటు చేసిన టెలిహబ్‌ను డిఎంహెచ్ఒ డాక్టర్ జీవనరాణి శనివారం పరిశీలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఉన్న ఇస్మాయిల్ కాలనీలోని యుపిహెచ్‌సిని సందర్శించి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. మాతృ సంబంధమైన పిల్లల ఆరోగ్య సేవలను, సంక్రమిత వ్యాధులు, ఇ-ఆశా యాప్, పిల్లల టీకాల కార్యక్రమం, ఇహెచ్‌ఆర్, మందులు నిల్వను పరిశీలించి తగు సలహాలను సూచనలను ఇచ్చారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాన్ని ఈ సందర్భంగా రివ్యూ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు, సిబ్బంది 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.



యుపిహెచ్‌సి సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

నకిలీ పట్టాలపై దర్యాప్తు చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి- బొబ్బిలి

ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న భూ కబ్జాలపై రెవెన్యూ యంత్రాంగం సమగ్ర దర్యాప్తు నిర్వహించి, నకిలీ పట్టాలు తయారు చేస్తున్న వ్యక్తులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో గతంలో కొంతమంది రాజకీయ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వారి ఇష్టానుసారంగా పెద్ద పెద్ద డూప్లెక్స్ ఇల్లు నిర్మించి లక్షలాది రూపాయలకు అమ్ముకున్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే బేబీనాయన తక్షణమే స్పందించి ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న భూకబ్జాలు నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న, సిపిఐ పట్టణ నాయకులు పాలూరు కృష్ణ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాల రికవరీకి చర్యలు

ప్రజాశక్తి- రేగిడి

గ్రామాల్లో మహిళా సంఘాలు తీసుకున్న బ్యాంకు రుణాల రికవరీకి చర్యలు తీసుకోవాలని ఎపి చిరంజీవి అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో విఒఎలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి మార్చి వరకు బ్యాంకులో కొత్త లోన్లు, రికవరీ వంటివి పూర్తి చేయాలన్నారు. ఒకరి లోన్స్ ఇంకొరికి ఇవ్వొద్దన్నారు. ఎస్ఎన్, పిఒపి లోన్స్ శతశాతం పూర్తి చేయాలన్నారు. బ్యాంకు లోన్స్ 80 శాతం చేసామన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ బాసిన గోవిందరావు ఉన్నారు.



రాష్ట్రమంత్రి నారాయణకు వినతినిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

ఉద్యోగోన్నతుల సమస్యలు పరిష్కరించాలి

పురపాలక శాఖా మంత్రికి టౌన్ ప్లానింగ్ అధికారుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రవ్యాప్తంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర టౌన్ ప్లానింగ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణకు, ఇటీవల రాష్ట్ర పట్టణ పరిపాలక శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సురేష్ కుమార్‌కు, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్‌జె విద్యుల్లతకు శనివారం వినతిపత్రం అందజేశారు. టిపిఒలకు అసిస్టెంట్ డైరెక్టర్లుగా, అసిస్టెంట్ డైరెక్టర్లను డిప్యూటీ డైరెక్టర్లగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరినట్లు వెంకటేశ్వర రావు తెలిపారు. మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించి వెంటనే ఫైల్ సిద్ధం చేయాలని డైరెక్టర్‌ను ఆదేశించారన్నారు. ముఖ్య కార్యదర్శి కూడా సానుకూలంగా స్పందించారన్నారు. వినతి అందజేసిన వారిలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు సత్తారు హరి దాసు, కార్యదర్శి మోహన్‌బాబు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు వెంకట రావు, పి.నాయుడు, వెంకటరమణ, రఘునాథ్ రావు, వినయ్ ప్రసాద్ ఉన్నారు.

మూగజీవాల సంక్షేమానికే ఉచిత శిబిరాలు

ప్రజాశక్తి-రామభద్రపురం

ఆరికతోటలోని పశువుల ఆస్పత్రి ఆవరణలో పశు వైద్యాధికారి సురేష్ కుమార్ ఆధ్వర్యాన పశువైద్య శిబిరం నిర్వహించారు. వివిధ పశువులకు గర్భ కోస చికిత్సలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, కృత్రిమ గర్భధారణ మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి పెంకి శేఖర్‌బాబు, జనసేన నాయకులు అల్లు రమేష్ పాల్గొన్నారు.

లక్కవరపుకోట : మండలంలోని చందులూరు గ్రామంలో శనివారం పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. రైతులకు జంతు సంక్షేమం కోసం ఆమె అవగాహన కల్పించారు.

మొక్కలు నాటిన విమానాశ్రయ నిర్మాణ సంస్థ

ప్రజాశక్తి - భోగాపురం

స్థానిక ఉన్నత పాఠశాలలో విమానాశ్రయ నిర్మాణ సంస్థ జిఎంఆర్, ఎల్‌అండ్‌టీలు శనివారం 3వేల మొక్కలు నాటారు. రిపబ్లిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 10వేలు మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రాజెక్టు డైరెక్టర్ జీవా డేవిడ్ అన్నారు. అందుకు ఈ పాఠశాలలో 3వేలు మొక్కలు నాటామన్నారు. ఎస్ఐ సూర్యకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, విద్యార్థుల చేతుల మీదుగా మొక్కలను నాటారు.

కొబ్బరి మొక్కలు ధ్వంసంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పతివాడ బర్రిపేట గ్రామంలో బర్రి నర్సయ్యమ్మకు చెందిన కొబ్బరి మొక్కలు ధ్వంసం చేయడంపై పూసపాటిరేగ పోలీస్ స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొమర పైడిరాజు, కొమర నీలాకరి, బర్రి చిన కొర్లమ్మ, బర్రి సామాలమ్మల ఇంటి ప్రహరీగోడలోకి అక్రమంగా ప్రవేశించి కొబ్బరి మొక్కలను నరికివేయడంతో పాటు మొక్కలు ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో మొక్కలు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో తెలిపారు. గత కొంత కాలంగా ఇరు వురి మధ్య విభేధాలు వున్నట్లు తెలిసింది. దీనిపై పూసపాటిరేగ ఎస్ఐ ఐ. దుర్గాప్రసాదు విచారణ చేస్తున్నారు.

తీర్మానాలు లేకుండానే..



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఎర్రయ్య

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీ సర్వసభ్య సమావేశం ఎటువంటి తీర్మానాలూ లేకుండా, అభివృద్ధి అజెండా లేకుండానే శనివారం జరిగింది. కార్యదర్శి శైలజ ఆధ్వర్యంలో సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి అధ్యక్షతన పంచాయతీ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎటువంటి తీర్మానాలు లేకుండానే ముగించడం విశేషం. ఈ సమావేశంలో సర్పంచ్ రామస్వామి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పంచాయతీలో చర్చనీయాంశంగా మారాయి. గతంలో ప్రత్యేకాధికారి పాలనలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన వెంకటరావు... నాడు చేసిన పనులకు బకాయిలు చెల్లించలేదని, అవే సుమారు రూ.2 కోట్ల మేర చెల్లించాల్సి వచ్చిందని తెలిపారు. వైఎస్ఆర్ షాపింగ్ కాంప్లెక్స్ బకాయిలు రూ.కోటి మేర ఉన్నాయని, వాటిని వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి శ్రీదేవి, వైస్ సర్పంచ్ పెనగంటి మంగవేణి, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆశ్రమంలో మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ

వృద్ధుల అనుభవం.. నేటితరానికి అవసరం

లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ

ప్రజాశక్తి - జామి

నేటి తరానికి వృద్ధుల గొప్పతనాన్ని చాటి చెప్పాలని లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ అన్నారు. శనివారం మండలంలోని అట్టాడ గ్రామంలోని బిఎన్ఆర్ ఆశ్రమాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రమ నిర్వాహకులు బీసెట్టి శారద, బాల వెంకటలక్ష్మి శిరీష, హరితసాయి ఆధ్వర్యంలో వృద్ధులకు అందిస్తున్న సేవలు పరిశీలించారు. ఆశ్రమం ఏర్పాటు చేసి వృద్ధుల ఆలన పాలన చూసుకుంటూ వాళ్లకు ధైర్యంగా ఉన్న వీరిని అభినందించారు. నేటి తరం వృద్ధులను విస్మరిస్తుందని, ఇది మంచి పద్ధతి కాదని తెలిపారు. నేటితరాలకు వృద్ధుల దిశా నిర్దేశం ఎంతో అవసరమన్నారు.

అలరించిన తోట సిల్వర్ స్టార్ మిమిక్రీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక గురజాడ పాఠశాలలో శనివారం నిర్వహించిన తోట సిల్వర్ స్టార్ మిమిక్రీ ఎంతగానో అలరించింది. మిమిక్రీ ద్వారా విద్యార్థులను నవ్వించడంతో పాటు దేశభక్తి సందేశాన్ని ఇచ్చారు. ఆయన గత 50ఏళ్లగా 9వేలకు పైగా అంతర్జాతీయ స్థాయిలో ప్రోగ్రామ్స్ ఇచ్చారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి , స్కూల్ ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాల ప్రవేశానికి దరఖాస్తులు

సీతంపేట : సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భామిని, మెలియాపుట్టి ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. aptwgurukulam.ap.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

28న పైడితల్లమ్మ అవతరణ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 28న పైడితల్లి అమ్మవారి అవతరణ దినోత్సవం సందర్భంగా నగరంలో కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు చదురుగుడి మీదుగా రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వనం గుడి వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు శివ సీతారామ రాజుస్మారక పీఠం అధ్యక్షులు ఎస్-ఎస్ఎస్ఎస్ రాజు, పైడిమాంబ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు అర్ సూర్యపాత్రో తెలిపారు. శనివారం తమ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 28-1-1757న పెద్ద చెరువులో దొరికిన ప్రతిమను 'పైడితల్లి'గా నామకరణం చేశారు. ప్రస్తుత స్టేషన్ రోడ్డులోని వనం గుడిలో ఆ ప్రతిమను ప్రతిష్ట చేసారన్నారు. నాటి నుండి ప్రజలు ఆమెను పైడితల్లి అమ్మవారిగా కొలుస్తున్నారని తెలిపారు. 28న ఉదయం 8.30గంలలకు కోట వద్ద నుండి ఊరేగింపుగా బయలు దేరి, చదురుగుడి మీదుగా, వనం గుడి చేరుకొని, అమ్మవారికి నివాళి అర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బొంగ మహేష్, జి.మహేష్,ఎం.శంకర్, ఎర్నినాయుడు,శ్రీను, కె.సాయిబాబా పాల్గొన్నారు.

అప్ గ్రేడ్ సరే..సౌకర్యాలేవీ?

ప్రజాశక్తి- శృంగవరపుకోట

శృంగవరపుకోట సర్కిల్ పరిధిలో జామి, ఎస్‌కోట, లక్కవరపుకోట, వేపాడ మండలాలు ఉండేవి. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 45 పోలీస్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేస్తూ గత ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అందులో మన జిల్లాలో భోగాపురం, ఎస్ కోట పోలీస్ స్టేషన్లను గత సంవత్సరం జనవరిలో అప్ గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే. ఎస్‌కోట పోలీస్ స్టేషన్‌ను అప్ గ్రేడ్ చేయటం వల్ల ఎస్‌కోట పోలీస్ స్టేషన్‌లో అప్పటి వరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉండే ఎస్ఐ స్థానంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా సిఐ కొనసాగుతున్నారు. అప్పటివరకు ఎస్.కోట పోలీస్ స్టేషన్ మేడపైన ఉండే సర్కిల్ కార్యాలయం అప్పటి నుండి వేపాడ, లక్కవరపుకోట, జామి మండలాలకు రూరల్ సర్కిల్ కార్యాలయంగా వేపాడ మండలంలోని బొద్దాం గ్రామంలో విశాఖ అరకు రహదారికి అనుకొని అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. అప్ గ్రేడ్ అయి సంవత్సరం కావస్తున్నా రూరల్ సర్కిల్ కార్యాలయానికి హోంశాఖ నూతన భవనాన్ని నిర్మించకపోవడంతో ఈ కార్యాలయం నేటికీ అద్దె భవనంలోనే నడుస్తుంది. పోలీస్ స్టేషన్‌ను అప్ గ్రేడ్ చేసి రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తరలించారు కానీ ఆ కార్యాలయంలో అందుకు తగ్గ సౌకర్యాలు మాత్రం కల్పించలేదు.



అద్దెభవనంలో ఉన్న రూరల్ పోలీస్‌స్టేషన్

లక్కవరపుకోటలో రూరల్ సర్కిల్ కార్యాలయం

రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ కార్యాలయాన్ని హోంశాఖ ఆదేశాలతో లక్కవరపుకోటలో నిర్మించనున్నారు. ఈ మండలంలో కార్యాలయాన్ని నిర్మిస్తే అటు జామి, ఇటు వేపాడ మండలాలు కూడా ఆనుకొని ఉన్నందున సర్కిల్ కార్యాలయానికి వచ్చేవారికి అణువుగా ఉంటుంది భవనం నిర్మించేంత వరకు లక్కవరపుకోట మండల కేంద్రంలో ఓ ప్రభుత్వ భవనాన్ని కేటాయించాలని హోంశాఖను కోరాం. హోం శాఖ నుంచి ఆదేశాలు వచ్చేవరకు అద్దె భవనంలోనే కార్యాలయం కొనసాగుతుంది. అద్దె భవనంలోనూ సౌకర్యాలు ఉన్నాయి. సిబ్బంది అవసరమైతే మూడు స్టేషన్ల నుండి తీసుకుంటాం.

ఎల్. అప్పలనాయుడు, రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్